ప్రతి అక్షరం ప్రజాహితం


RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -72 పేజీలు - 05 వెల - 04/- శనివారం 21 మార్చి 2026

# అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై సీఎం సమీక్ష



పంట నష్టంపై రెండు రోజుల్లో నివేదిక

ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు

కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్

**అమరావతి, మార్చి20ఆంధ్ర ప్రగతి**

అకాల వర్షాలు, భారీ గాలులు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాకు అంతరాయం రాకుండా చూడాలని చెప్పారు. శుక్రవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా అంచనా వేశారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా ప్రభావం చూపాయని తెలిపారు. అరటి, బొప్పాయి, **మిగతా 2లో...**


## : నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

ఇరాన్‌తో యుద్ధంలో కలిసి రావడానికి ఇష్టపడడంలేదన్న ట్రంప్

ఇప్పుడు అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం

హర్మూజ్ జలసంధిని తెరవడానికి రావడం లేదని విమర్శ

ఈ పిరికివాళ్లను గుర్తుంచుకుంటామని హెచ్చరిక



**న్యూఢిల్లీ,మార్చి20ఆంధ్ర ప్రగతి**


హర్మూజ్ జలసంధిని తెరవడానికి ముందుకు రావాలని తాను చేసిన విజ్ఞప్తిని నాటో దేశాలు పట్టించుకోకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటో దేశాల వ్యవహారశైలిపై తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చిందులు వేశారు. అమెరికా లేని 'నాటో' ఓ కాగితపు పులి అని, అమెరికా లేకుండా ఏమీ చేయలేదని మండిపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో చేరనందుకు, హర్మూజ్ జలసంధిని తెరవడంలో సహకరించనందుకు వారిని గుర్తించుకుంటామని హెచ్చరిక చేశారు. **మిగతా 2లో...**

# కనిపించిన నెలవంక..

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు -నేడు పవిత్ర రంజాన్ పండగ

**న్యూఢిల్లీ,మార్చి20ఆంధ్ర ప్రగతి**

పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు



## ఐఏఎస్‌ల బదిలీలు.. సీఆర్‌డీఏకి కొత్త కమిషనర్



పౌర సరఫరాల శాఖకు బదిలీ అయిన కన్నబాబు

మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు రవి సుభాష్‌కు అప్పగింత

**అమరావతి,మార్చి20ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగంలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల్లో భాగంగా, అత్యంత కీలకమైన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నూతన కమిషనర్‌గా విజయరామరాజును నియమించింది. **మిగతా 2లో...**

## అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

: సుప్రీంకోర్టు కీలక తీర్పు

గుజరాత్‌కు చెందిన వ్యక్తిపై నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత

సూసైడ్ నోట్‌లో బెదిరింపుల వివరాలు లేవని పేర్కొన్న ధర్మాసనం

అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని వ్యాఖ్య




## గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

పోలవరం జిల్లాలో విషాదం

గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఏడుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు

నీటిలో కొట్టుకుపోయిన ఐదుగురు విద్యార్థులు...

మరో ఇద్దరు ఒడ్డుకు చేరిన వైనం

ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాల వెలికితీత

మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు




# 3,24,234 కోట్లు

## శాసనసభలో బడ్జెట్ ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రెవెన్యూ వ్యయం 2,34,406 కోట్లు

మూలధన వ్యయం రూ.47,267 కోట్లు

మండలిలో పద్దును ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్

జూన్2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

'చేయూత'తో 2 లక్షల మందికి కొత్త పింఛన్లు

ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్‌ఫాస్ట్ పథకం

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం

గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు

ఉభయసభలు సోమవారానికి వాయిదా

**హైదరాబాద్ మార్చి20ఆంధ్ర ప్రగతి**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లుగా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా చూపెట్టారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున జీవిత బీమా అందించేలా ఈ ఏడాది జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. చేయూత పథకం ద్వారా అర్హులైన 2 లక్షల మందికి నూతన పింఛన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు **మిగతా 2లో...**



## ఆస్తుల విషయంలో జగన్ అన్యాయం

జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడుద

: వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన

వైఎస్ కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన విజయమ్మ

ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల

షర్మిలకు రాసిన ఆస్తులు న్యాయంగా ఆమెకు చెందినవేనని వెల్లడి

వైఎస్సార్ ఆదేశానుసారం ఆస్తులు నలుగురు మనుమలకు పంచాలని వివరణ



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అప్పు తిరిగివ్వాలని అడగడం ఆత్మహత్యకు ప్రేరేపణ కాదు

## : సుప్రీంకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ,మార్చి20ఆంధ్ర ప్రగతి**
అప్పు తిరిగి చెల్లించాలని అడగడం లేదా ఒత్తిడి చేయడం ఆత్మహత్యకు ప్రేరేపించడం కిందకు రాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. కేవలం రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేయడాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన ఆత్మహత్య ప్రేరేపణ కేసును కొట్టివేసింది. ఈ కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తోసిపుచ్చుతూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పు ఇచ్చింది.

### కేసు నేపథ్యం ఏమిటంటే..

గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పలువురు అప్పుల వాళ్లు వేధిస్తున్నారని ఆరోపిస్తూ అతను రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించింది. ఆ నోట్‌లో తొమ్మిది మంది రుణదాతల పేర్లను పేర్కొన్నాడు. వారిలో ఒకరైన ధీరూభాయ్ నంజీభాయ్ పటేల్ లోత్వాలాపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ), 506(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల వ్యవధిలో నిందితుడు సుమారు 40 సార్లు ఫోన్ చేసినట్లు కాల్ రికార్డులను ప్రాసిక్యూషన్ ఆధారాలుగా చూపింది. తనపై కేసును కొట్టివేయాలని ధీరూభాయ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

### సుప్రీంకోర్టు ఏమంది?


ఈ కేసును విచారించిన సుప్రీం ధర్మాసనం, ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు ఆత్మహత్య ప్రేరేపణను నిరూపించడానికి సరిపోవని అభిప్రాయపడింది. "సూసైడ్ నోట్‌లో తొమ్మిది మంది పేర్లు ఉన్నప్పటికీ, ఎవరి పాత్ర ఏమిటో స్పష్టంగా లేదు. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు, ఎక్కడ జరిగాయనే వివరాలు లేవు. అందరు రుణదాతలను ఒకే గాటన కట్టారు. ఇలాంటి సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ జరపడం వృధా ప్రయాస అవుతుంది" అని ధర్మాసనం పేర్కొంది.
అప్పు తిరిగివ్వమని రుణదాత ఫోన్ చేయడం చట్టబద్ధమైన చర్యేనని, కేవలం ఎక్కువసార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. మృతుడిపై శారీరక దాడి లేదా బలవంతం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ధీరూభాయ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్, తదుపరి చర్యలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

# అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై సీఎం సమీక్ష

**మొదటి పేజీ తరువాయి**
మిర్చి, మామిడి, నిమ్మ, బత్తాయి, కూరగాయల పంటలు దెబ్బతినగా, రూ. 23కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. మొత్తం నష్టం రూ. 63కోట్లుగా అంచనా వేశారు. దీనిపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. యుద్ధం కొనసాగితే.. ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎల్పీజీ గ్యాస్ సిలెండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలని ఆదేశించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విద్యా సంస్థలు, ఆలయాలు, అన్నక్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ సరఫరాలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, అప్రమత్తం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తద్వారా పంట నష్టం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, పంట నష్టం జరిగినప్పుడు పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని చెప్పారు. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలకు జరిగిన నష్టంపై గురువారం సీఎం చంద్రబాబు సమీక్ష జరిపారు. ఇప్పటి వరకు గాలివానలు, వర్షాలు, వడగళ్ల కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణా, నెల్లూరు, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్, అనంతపురం, మన్యం జిల్లాల్లోని 16 మండలాల్లో 89 గ్రామాల్లో వర్షాలతో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అధికారులు సీఎంకు వివరించారు. 384 హెక్టార్లలో వరి, 630 హెక్టార్లలో మొక్కజొన్న, 200 హెక్టార్లలో మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మొత్తం 1,215 హెక్టార్లలో సాధారణ పంటలు దెబ్బతినగా, 2,043 మంది రైతులు నష్టపోయినట్లు చెప్పారు. అలాగే అనంతపురం, శ్రీసత్యసాయి, ఎన్టీఆర్
జిల్లాల్లోని ఉద్యాన పంటలపైనా అకాల వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయని అధికారులు తెలిపారు.
-----------

# ఆస్తుల విషయంలో జగన్ అన్యాయం

**అమరావతి, మార్చి20ఆంధ్ర ప్రగతి**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య గత కొంతకాలంగా కొనసాగుతున్న ఆస్తుల వివాదం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై వారి తల్లి వైఎస్ విజయమ్మ స్వయంగా స్పందించారు. కుటుంబ ఆస్తుల పంపకాలపై పూర్తి స్పష్టతనిస్తూ ఆమె ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల చేశారు. ఆ నోటరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లేఖలో ఆమె తన కుమారుడు జగన్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.
"2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే (ఛశీఎఎఱఅవవ టుఎఱశ్రీఎ ఖంంవ్ం). ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది.
ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ ఎంవోయూ రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహా ఎంవోయూలో లేని యెలహంక


Phone No:
Sold To/Issued To: Y. Vijaya
For Whom/ID Proof: Self
భారత INDIA INDIA NON JUDICIAL
₹ 0000020/-
ZERO ZERO ZERO ZERO ZERO TWO ZERO
MAR-20-2026 11:32:20
20/3/2026

**Clarification:**

2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే ( combined family assets). ఆస్తుల పంపకం ఎప్పుడు జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలుకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశ్యం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది.

MOUలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ MOU రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహ MOUలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను.


ఆస్తుల పంపకం జరగ లేదు. ఇప్పుడు చదువుతున్న షర్మిల ఆస్తుల లాంటివి వైఎస్సార్ జగన్‌కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు ? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా.

దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే.

ఇట్లు, Y.S Vijayamma
వైఎస్ విజయ రాజశేఖర రెడ్డి.

ATTESTED
J. Chiranjeevi Babu
B.Com, LLB
ADVOCATE & NOTARY
#127/128/C, Sri Krishna Nagar
Near Sai Kiran Public School,
Yousufguda, Hyderabad-500 045
Ph: 9848436173 7981845138
20 MAR 2026

ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను.



ఆస్తుల పంపకం జరగలేదు. షర్మిలకు ఇచ్చినటువంటి ఆస్తుల లాంటివే వైఎస్సార్ గారు జగన్ కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా.
దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అంటూ విజయమ్మ తన నోటరీలో పేర్కొన్నారు.

# ఏపీలో ఐఏఎస్‌ల బదిలీలు..

**మొదటి పేజీ తరువాయి**
ఇప్పటివరకు సీఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న కె. కన్నబాబును పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయరామరాజుకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీ అమరావతి అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.
ఇదే సమయంలో మరికొన్ని ముఖ్యమైన నియామకాలు కూడా జరిగాయి. మార్కాపురం జిల్లా కలెక్టర్‌గా విజయ సునీతను, పోలవరం జిల్లా కలెక్టర్‌గా దినేశ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా ఉన్న సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. అలాగే, రవి సుభాష్‌కు వ్యవసాయం, మార్కెటింగ్ శాఖల పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బదిలీలు పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలుగా భావిస్తున్నారు.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు...

పోలవరం,**మార్చి20ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను వెలికితీయగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.
పోలీసుల వివరాల ప్రకారం, అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల సందర్భంగా విహారయాత్రకు వెళ్లారు. భద్రాచలం సందర్శన అనంతరం ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఐదుగురు కొట్టుకుపోయారు. మరో ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఒడ్డుకు చేరుకున్నారు.సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సి. శ్రీకర్ (భద్రాచలం), పి. అభిరామ్ (విజయనగరం), నవదీప్ (ఉయ్యూరు) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లె) కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని చందూరి దీపక్, గడ్డం హర్షవర్ధన్‌గా గుర్తించారు.ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు ముమ్మరం చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# కనిపించిన నెలవంక..

**మొదటి పేజీ తరువాయి**
పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల అనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

## నాటో దేశాలపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం

**మొదటి పేజీ తరువాయి**
"అమెరికా లేకుండా నాటో ఒక పేపర్ టైగర్ వంటిదే. అణ్వాయుధాలు కలిగిన ఇరాన్‌ను ఆపడానికి జరుగుతున్న యుద్ధంలో వారు చేరడానికి ఇష్టపడటం లేదు. కానీ తక్కువ నష్టంతో మా సైన్యం విజయం సాధించింది. అయినప్పటికీ నాటో దేశాలు ఇప్పుడు తాము చెల్లించవలసి వస్తున్న అధిక చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధిక చమురు ధరలకు కారణమైన హర్మూజ్ జలసంధిని తెరవడానికి నాటో దేశాలు ఇష్టపడటం లేదు. ఒక సాధారణ సైనిక విన్యాసం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరవొచ్చు. కానీ సహకరించేందుకు వారు ముందుకు రావడం లేదు. వారు పిరికివాళ్లు, వారిని గుర్తుంచుకుంటాం" అని ట్రంప్ హెచ్చరించారు.

## ఏపీ మద్యం కేసు.. ముప్పిడి అవినాశ్ రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

**అమరావతి, మార్చి20ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీం కోర్టు భారీ ఊరటను కల్పించింది. ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్ లో ఉన్న ఆయనను ఇప్పటికే సిట్ మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించింది. ఈ విచారణలో ఆయన పలు విషయాలను వెల్లడించినట్టు సమాచారం.
ఈ కేసులో ముప్పిడి అవినాశ్ రెడ్డి నగదు బదిలీలు, ఆర్థిక నియంత్రణలో కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ మద్యం కేసులో రాజ్ కెసిరెడ్డి ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అవినాశ్ రెడ్డి జైలు నుంచి బయటకు రానున్నారు. మరోవైపు, మద్యం విక్రయాల్లో జరిగిన అక్రమాలు, సిండికేట్ల ఏర్పాటు వెనుక ఉన్న అసలు శక్తులను బయటకు తీసేందుకు సిట్ తన విచారణను మరింత వేగవంతం చేసింది.

# 3,24,234 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**
చదివే పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా పోషకాలతో కూడిన రాగిజావ, పాలు అందిస్తామని చెప్పారు.
ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్టు ప్రకటించారు. ఇంటర్ చదివే వికలాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేస్తామన్నారు. పాఠశాలల్లో వంటశాలలను ఆధునీకరించేందుకు రూ. 100 కోట్లు కేటాయించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ. 1000 కోట్లు, వీరనారి చిట్యాల ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ. 400 కోట్లు, మిగతా యూనివర్సిటీలకు కూడా బడ్జెట్‌లో కొంతమేర కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. గోదావరి పుష్కరాల కోసం రూ. 500 కోట్లు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మండలిలో పౌరసంబంధాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రతిపాదించారు.
అనంతరం ఉభయ సభలు సోమవారం ఉదయం 10 గంటలకు వాయిదా పడ్డాయి. శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి బడ్జెట్‌పై ప్రసంగిస్తూడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుస్తున్నామనీ, ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ లక్ష్యమని నొక్కి చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిపోయిందనీ, ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వం పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే ఆర్థిక క్రమశిక్షణతో పాలనను గాడిన పెడుతున్న తీరును వివరించారు. తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమనీ, సుస్థిరమైన అభివృద్ధి వైపునకు నడిపించేలా బడ్జెట్ రూపొందించామని తెలిపారు.

### తెలంగాణ వృద్ధిరేటు 10.7 శాతం

2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి ప్రస్తుత ధరల ప్రకారం రూ. 17, 82,198 కోట్లు అనీ, వృద్ధిరేటు 10.7 శాతంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ. 3,57,13,886 కోట్లుగా ఉండగా వృద్ధిరేటు 8 శాతంగానే ఉందని చెప్పారు. దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ 5 శాతం వాటా కలిగి దేశానికి బలమైన అభివృద్ధి యంత్రంలా ఉందన్నారు. 2024-25లో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.8 శాతం ఉండగా 2025-26 నాటికి 8 శాతానికి పడిపోయిందనీ, అదే సందర్భంలో 2024-25లో తెలంగాణ రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటు 10.6 శాతం ఉండగా ఈ ఏడాది 10.7 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం రూ. 4,18,931గా ఉందనీ, దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే 1.9 రెట్లు ఎక్కువ అని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు.

### సీఎస్ఎస్ నిధులపై దృష్టి

గత ప్రభుత్వం 2014 నుంచి 2023వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్) నిధులను రాబట్టడంలో విఫలమైందని డిప్యూటీ సీఎం భట్టి విమర్శించారు. తమ ప్రభుత్వం 2014-15 నుంచి 2023-24 వరకు సీఎస్ఎస్ కింద బకాయిపడ్డ రూ. 3 వేల కోట్లను విడుదల చేసిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ. 7,072 కోట్లను రాబట్టామని చెప్పారు. మరింత చిత్తశుద్ధితో అధిక



నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

### రుణ పునర్వ్యవస్థీకరణతో నగదు వెసులుబాటు

గత ప్రభుత్వం అధిక వడ్డీకి తెచ్చిన రూ. 25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరించామనీ, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20 ఏండ్ల నుంచి 39 ఏండ్లకు పొడిగించడంలో సక్సెస్ అయ్యామని భట్టి తెలిపారు. ఈ రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా 2025-26 నుంచి 2031-32 దాకా చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల భారం కాస్తా రూ. 11,915 కోట్లకు తగ్గిందని తెలిపారు. దాని ద్వారా రాష్ట్రానికి రూ. 22, 142 కోట్ల క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగిందని చెప్పారు. ఈ ఏడాది రూ. 27,988 కోట్ల అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి మార్చుకున్నామని తెలిపారు.

### రూపాయి పంపితే కేంద్రం ఇచ్చేది 42 పైసలే

కేంద్రానికి తెలంగాణ నుంచి రూపాయి పంపితే తిరిగి 42 పైసలే మనకు దక్కుతున్నదని భట్టి వివరించారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, సొంత రాబడి పెంచుకుంటూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రాష్ట్రాలకు ఈ పంపకం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని 16వ ఆర్థిక సంఘం ముందు ఎత్తిచూపామన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీని కూడా కొలమానంగా తీసుకునేలా ఒప్పించామనీ, తెలంగాణ వాటాను 2.102 శాతం నుంచి 2.174 శాతానికి పెంచుకోవడంలో కొంతమేర సక్సెస్ అయ్యామని తెలిపారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ రైజింగ్ విజన్ -2047గ్లోబల్ సమ్మిట్ ఆధారంగానే తెలంగాణ రైజింగ్ విజన్-2047ని విడుదల చేశామని డిప్యూటీ సీఎం విక్రమార్క చెప్పారు. ఆ సమ్మిట్‌లో వందకుపైగా ఎంఓయూలు జరిగాయనీ, వాటి ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ లో 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' ను ఆవిష్కరించారనీ, 2030 నాటికి పరిశోధనాభివృద్ధి, ఆధునిక తయారీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలపాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఆ రంగంలో ఇప్పటిదాకా రూ. 73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామనీ, ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 2.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. రానున్నకాలంలో సింగపూర్‌కు చెందిన ఏజీఐడీసీ, వియత్నాంకు చెందిన విన్ గ్రూప్, జేసీకే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థల నుంచి 1,03, 500 కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్యూర్..ప్యూర్..రేర్

తెలంగాణను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించామని భట్టి తెలిపారు. క్యూర్‌లో సేవారంగానికి, ప్యూర్‌లో ఉత్పాదక రంగానికి, రేర్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని భట్టి అన్నారు. 30 వేల ఎకరాల్లో భూగర్భవిద్యుత్, పర్యావరణ అనుకూల స్మార్ట్ గ్రిడ్లతో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామనీ, దాన్ని ఏపీలోని మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్నదని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 67,763 ఉద్యోగాలను భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా 3.76 లక్షల మందికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేశామని ప్రకటించారు. జనగణనను డిజిటల్ విధానంలో చేయ బోతున్నామని తెలిపారు.
ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణ ఆడబిడ్డలు రూ. 9,222 కోట్లు ఆదా చేసుకున్నారనీ, రూ. 500కే గ్యాస్‌సిలిండ్ పథకం ద్వారా 43 లక్షల కుటుంబాలకు రూ. 752 కోట్లు, ఉచిత కరెంటు ద్వారా పేదలకు రూ. 3,954 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. మహిళా శక్తి మిషన్ ద్వారా మహిళలకు ఐదేండ్లలో లక్ష కోట్ల రూపాయలు ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఇప్పటికే 57, 938 కోట్ల రూపాయల రుణం ఇప్పించామని తెలిపారు. 1,329 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశామని చెప్పారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకం కింద ఎస్టీలకు 12,600 కోట్ల బడ్జెట్‌తో వంద శాతం సబ్సిడీ కింద సోలార్ పంపు సెట్లను అందిస్తామనీ, 6 లక్షల ఎకరాల పోడు భూములలో అటవీ ఉత్పత్తులకు సంబంధించిన తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇప్పటికే అచ్చంపేటలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామనీ, విధివిధానాలు రూపొందించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రకటించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 21 మార్చి 2026

# నంద్యాల మీదుగా బెంగళూరు, కలకత్తాకు వారంతపు రెగ్యులర్ ట్రైన్.

## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 20:**



ఒక సంవత్సరం నుంచి స్పెషల్ ఎక్స్ ప్రెస్ గా నడుస్తున్న రైలు నెంబర్ 02683/02684 సంత్రగాచి- ఎల్హంక-సంత్రగాచి కి నడుస్తున్న వారంతపు స్పెషల్ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసు ట్రైన్ ఆన్ డిమాండ్ గా పరిగణించి దక్షిణ మధ్య రైల్వే శాఖ 02-ఏప్రిల్ 2026 నుండి రెగ్యులర్ వారంతపు ఎక్స్ ప్రెస్ గా రైలు నెంబర్ 18063 ఉంటుందని రైల్వే అధికారులు సూచించారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం తెలిపారు.

ఈ రైలు ప్రతి గురువారం సంత్రగాచి(కలకత్తా)నుండి బయలుదేరి దువ్వాడ, విజయవాడ మీదుగా నంద్యాలకు మరుసటి రోజు శుక్రవారం మధ్యాహ్నం 3:15 గంటలకు చేరి, ఎల్హంక(బెంగళూరు) వైపు బయలుదేరుతుందని, . 18064 రైలు నెంబర్ ఎల్హంక లో ప్రతి శనివారం ఉదయం 4:50 నిమిషాలకు బయలుదేరి అనంతపురం, డోన్ మీదుగా నంద్యాలకు మధ్యాహ్నం 1:00 గంటలకు చేరుకొని విజయవాడ, దువ్వాడ మీదుగా సంత్రగాచికి మరుసటి రోజు సాయంత్రం ఆదివారం 5 గంటలకు చేరుకుంటుందన్నారు. .ఈ రైలు మొత్తం ఏ.సీ బోగీలతో నడుస్తుందని, స్పెషల్ ఎక్స్ ప్రెస్ గా ఉన్నప్పుడు ధర అధికంగా ఉండేది ఇప్పుడు రెగ్యులర్ రైలు కావడంతో 30% ధర తక్కువగా ఉంటుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల మీదుగా కలకత్తా, బెంగళూరుకు వెళ్లే నంద్యాల పార్లమెంట్ రైలు ప్రయాణికులు, నంద్యాల జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# ఐదేళ్ల నిష్కళంక సేవా ప్రస్థానానికి ముగింపు

## నంద్యాల మున్సిపాలిటీ 11వ వార్డు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు

## 11వ వార్డు కౌన్సిలర్ ఎస్ఎండి తమీమ్మ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:**

నంద్యాల పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ ఎస్ఎండి తమీమ్మ్ మాట్లాడుతూ..నన్ను విశ్వసించి, గెలిపించి ప్రజలకు సేవ చేసే ఈ గొప్ప అవకాశం కల్పించిన నంద్యాల మున్సిపాలిటీ 11వ వార్డు ప్రజలకు నా హృదయపూర్వక నమస్కారం. మీ అందరి ఆశీస్సులు, నమ్మకం, అపారమైన ప్రేమతో గత ఐదేళ్లుగా అహర్నిశలు ప్రజల కోసమే పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఈ ఐదేళ్ల కాలంలో నేను ఎలాంటి అవినీతి లేకుండా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నా బాధ్యతలను నిర్వర్తించాను అనే గర్వం నాకు ఉంది. ప్రతి సమస్యను నా సొంత సమస్యగా భావించి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ ముందుండే ప్రయత్నం చేశాను. పదవి ఒక బాధ్యత మాత్రమేడ కానీ ప్రజల విశ్వాసం ఒక పెద్ద వరం



అని నేను ఎప్పుడూ నమ్మాను. నా విజయానికి అండగా నిలిచి, అహర్నిశలు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ సహకారం లేకుండా ఈ ప్రయాణం సాధ్యం కాలేదు.

కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేను ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానానికి పార్టీలకు అతీతంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు. నాతో పాటు కలిసి పనిచేసిన తోటి కౌన్సిలర్లు, పారిశుధ్య సిబ్బంది, అధికారులు, మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అలాగే నాకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ నాయకత్వానికి నా వినమ్ర కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పదవీకాలం ముగిసినప్పటికీ, నా సేవా ప్రస్థానం ఇక్కడితో ఆగదు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పరిష్కారం కోసం, నంద్యాల అభివృద్ధి కోసం రాజీపడకుండా, మరింత నిబద్ధతతో ప్రజాసేవలో ముందుండి పనిచేస్తానని మీ అందరికీ హామీ ఇస్తున్నాను.

మీ నమ్మకం నాకు బలంమీ ఆశీర్వాదం నాకు ప్రేరణ మీ ప్రేమ నాకు బాధ్యత ప్రజల కోసండ ప్రజలతో కలిసి ఎల్లప్పుడూ మీతోనే ఉంటాను అని తెలిపారు

# కూటమి సర్కార్ కు రెండేళ్లు..

# నిరుపేదలకు అందని ఇళ్ల స్థలాలు..!

## తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 24 వ తారీఖున జరుగు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.

## గోడపత్రికలను విడుదల చేసిన సిపిఐ నాయకులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:**

ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల సాయం అందించకపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ నెల 24న తహసీల్దార్ కార్యక్రమం వద్ద చేపట్టబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో, పట్టణ నాయకుడు డి. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ముఖ్యఅతిథిగా పాల్గొని అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ..

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊరూరా తిరిగి నిరుపేదలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని



ఆర్భాటంగా ప్రకటించి, అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు.

గతంలో సిపిఐ ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతంలో ఇళ్లు లేని లబ్ధిదారులతో 3 వేల మందికి పైగా స్వీయ అర్జీలు ఇప్పించడం జరిగిందని, అప్పట్లో అర్హులైన వారిని గుర్తిస్తామని చెప్పి ఇప్పుడు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, అందుకే గతంలో అర్జీలు ఇచ్చిన లబ్ధిదారులందరినీ కలుపుకొని ఈ నెల 24న రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఒకవేళ 24వ తేదీ ధర్నా తర్వాత కూడా కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే, నంద్యాల



పట్టణంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. పేదల పక్షాన సిపిఐ నిరంతరం పోరాడుతుందని, హామీలు నెరవేర్చే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫకృద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు, సిపిఐ నాయకులు మురళీధర్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. హరినాథ్, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, సరోజమ్మ, రమిజా, రవణమ్మ తో పాటు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# సహనం, ప్రేమ, దయ, సోదరభావం, పరోపకారం, సంతోషం ల కలయికే రంజాన్.

## శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి అమరావతి, మార్చి 20:**



సహనం, ప్రేమ, దయ, సోదరభావం, పరోపకారం, సంతోషం ల కలయికే రంజాన్ అని ఈ సుగుణాలన్నీ ప్రజలకు భగవంతుడు ప్రసాదించాలని కోరుతూ ప్రజలకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం, నెలవంక అగుపించడంతో శనివారం దేశవ్యాప్తంగా రంజాన్ నిర్వహించుకుంటున్న సందర్భంగా ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ మంత్రి ఫరూక్ అమరావతిలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లింల పవిత్ర గ్రంథం అయిన 'ఖురాన్' ఆవిర్భవించిన నెల రంజాన్ అని,ఈ నెలలో ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. నెలవంక కనిపించడంతో ప్రారంభమయ్యే రంజాన్ మాసం మళ్లీ నెలవంక వచ్చిన తర్వాతే ముగుస్తుందన్నారు.అల్లా ప్రజలందరి జీవితంలో ఆనందం నింపాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలని కోరుకుంటూ,జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టాన్నీ అధిగమించే శక్తిని అల్లా ప్రసాదించాలని, సమానత్వాన్ని, సోదరభావాన్ని పెంపొందించి మానవత్వాన్ని మూర్తిభవింపచేయాలని ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలను మంత్రి ఫరూక్ తెలియజేశారు.

# నంద్యాల జిల్లా ప్రజలకు ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు.

## 38 వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:**



హితాన్ని బోధించే పండుగ రంజాన్ పండుగ అని, సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని, ఈ సందర్భంగా

38 వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు ముస్లిం సోదరుల కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లిం సోదరుల కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని, ముస్లిం సోదర, సోదరమణులందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, అల్లాహ్ దీవెనలతో నంద్యాల జిల్లా 38 వార్డు ప్రజలకు సకల శుభాలు కలగాలని తాటికొండ బుగ్గ రాముడు పేర్కొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో ఘనంగా గ్రామోత్సవం..!

## -ఆలయ ఈవో యం. రామక్రిష్ణ.

**ఆంధ్ర ప్రగతి పాణ్యం మార్చి 20:**

ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు ఉగాదిని పురస్కరించుకుని గురువారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో యం. రామకృష్ణ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిలిటరీ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో భాజా భజంత్రీలు, డప్పు వాయిద్యములు, బాణ సంచారంతో గ్రామ పురవీధుల గుండా అంగరంగ వైభవంగా గొప్ప ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాత్రి "భక్త చింతామణి" పూర్తి నాటక ప్రదర్శన నిర్వహించారు.





**అర్చకులకు ఉగాది పురస్కారము..!**

దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు గురువారం ఆలయ ప్రధాన అర్చకుల పురస్కారం నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పుల్లయ్య స్వామి, వీరయ్య స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మిలిటరీ సుబ్బారెడ్డి, సిబ్బంది శాలువాలు, పూలమాలలు, శేష వస్త్రములు, 10,116/- పారితోషికం సమర్పించి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వేద పండితుడు రోహిత్ శర్మ వారిని కూడా సత్కరించారు.

# టి బి వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలి.

## డోన్ తాసిల్దార్ యన్. రవి కుమార్.

## సామాజిక వేత్త డోన్ పి. మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ మార్చ్ 20:**

డోన్ పట్టణంలోని ఎమ్మార్వో ఆఫీస్ నందు డోన్ తాసిల్దార్ యన్. రవికుమార్ అధ్యక్షతన, సామాజిక వేత్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వం విడుదల చేసినటువంటి క్షయ నిర్మూలన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డోన్ తాసిల్దార్ యన్. రవి కూమార్,సామాజిక వేత్త డోన్ పి. మహమ్మద్ రఫి లు మాట్లాడుతూ..మన దేశం టిబి వ్యాధిని నిర్మూలించడానికి అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా పూర్తి స్థాయి లో వైద్యాన్ని అందిస్తుంది ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డోన్ తాసిల్దార్ యన్.రవి కుమార్ విడుదల చేసిన కరపత్రాలను సామాజికవేత్త పి.మహమ్మద్ రఫి పంపిణీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్





ఉపేంద్ర,విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ శ్యాంసుందర్రావు, భాస్కర్ నాయుడు, కృష్ణమూర్తి, గోవిందు, ఖాజా, యూనస్ , ఎమ్మార్వో ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డోన్ తాసిల్దార్ యన్. రవి కుమార్,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి లు మాట్లాడుతూ.. టి బి వ్యాది పై ప్రతి ఒక్కరికి అవగాహణ అవసరమని తెలిపారు. టిబి (క్షయ )వ్యాధి నివారణ కార్యక్రమాన్ని పటిష్టపరచడానికి భారత ప్రభుత్వం టి బి ని నోటిఫియబుల్ వ్యాధి గా నిర్ధారించారు. మన దేశంలో టిబి వ్యాధిని నిర్మూలించడానికి అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా పూర్తి స్థాయి లో వైద్యాన్ని అందిస్తుంది. ఈ విషయాన్ని మన భారతదేశంలోని ప్రతి ఒక్కరు అవగాహణ కలిగి ఉండి మనకు తెలిసిన వారందరికి తెలియజేయవలసిన భాద్యత ప్రతి ఒక్కరి పై ఉన్నది. అందరం కలిసి టిబి వ్యాధిని తరిమి కొడదామని డోన్ తాసిల్దార్ యన్.రవికుమార్,సామాజికవేత్తలు పి.మహమ్మద్ రఫి, పిలుపునిచ్చారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి.



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు మార్చి 20:**ఆత్మకూరు పట్టణంలోని మార్కస్ మసీద్, మహమ్మదీయ మసీద్ ల నందు ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పాల్గొన్నారు. ఇఫ్తార్ కు విచ్చేసిన ఎమ్మెల్యే బుడ్డా కు మతపెద్దలు, చిన్నారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ఎమ్మెల్యే బుడ్డా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నిష్టతో కఠిన ఉపవాసాన్ని ఆచరిస్తారన్నారు. ఈ రంజాన్ మాసం సమాజంలో సామరస్యాన్ని, సంతోషాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు.

# మైనారిటీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం

**..ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 18:**
రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లాలోని మౌజన్లు మరియు ఇమామ్‌లకు ఆరు నెలల గౌరవ వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇమామ్‌లకు నెలకు రూ. 10,000, మౌజన్లకు నెలకు రూ. 5,000 చొప్పున 2025 అక్టోబరు నుండి 2026 మార్చి వరకు ఉన్న బకాయి మొత్తాన్ని ఒకేసారి విడుదల చేయడంపై నంద్యాల జిల్లా పులిమద్ది గ్రామం మసీదు ముత్తవల్లి షేక్ హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మైనారిటీల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎన్.ఎమ్.డి. ఫరూక్ కి పులిమద్ది గ్రామ ముత్తవల్లి షేక్ హుస్సేన్ మరియు పులిమద్ది గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కులమతాలకు అతీతంగా చీరల పంపిణీ చేసిన చెంచు వేణుగోపాల్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:**
ఆయనకు కుల మతాలు లేవు తనకు కలిగిన దాంట్లో నుండి కొంత పేదలకు సాయం చేయాలన్న పెద్ద మనసు ఆయనది ఆ ప్రాంతం మహిళలకు పెద్దన్నయ్యగా ప్రతి పండక్కి కులమతాలకు అతీతంగా చీరల పంపిణీ చిన్నారులను చక్కగా చదువుకోవాలని ప్రతిరోజు చాక్లెట్లు పంచే మామయ్యగా పిలుచుకునే ఆ మహానుభావుడు ఎవరో కాదు అందరి ఆత్మబంధువు బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చెంచు వేణుగోపాల్ 4వ వార్డు ప్రజలకు ఏదో ఒక విధంగా సహాయ సహకారాలు అందించే అందరి మనసుల్లో స్థానం సంపాదించుకున్న బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చెంచు వేణుగోపాల్ ఆయన పేరు తెలియని వారు లేరు. సాయం కోరి వచ్చే వారికి కాదనకుండా తనకున్న దాంట్లో పేదవారికి సాయం చేయాలనే గుణం ఉన్న వ్యక్తి కులమతాలకు అతీతంగా రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం మహిళల కే కాకుండా ఇతర మతాలకు చెందిన మహిళలకు చీరల పంపిణీ



కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సుమారు 200 వందల మంది మహిళలకు పంపిణీ చేయడం జరిగింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని ప్రజలు మనస్ఫూర్తిగా చెంచు వేణుగోపాల్ కి ఆశీస్సులు అందజేశారు.

# ప్రతి గురువారం ఎముకలు, కీళ్ల ఉచిత ఓపిడి సేవలు..: డాక్టర్ మహమ్మద్ రఫీ.

**విజయవంతంగా ముగిసిన నెల రోజుల ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం.**

**నెల రోజులలో రెండు వేలకు పైగా రోగులకు ఉచిత ఓ పి డి చికిత్సలు అందించిన ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు డాక్టర్ మహమ్మద్ రఫీ.**

**డాక్టర్ మహమ్మద్ రఫీ ని ఘనంగా సత్కరించిన ఐఎంఏ నంద్యాల.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:**
ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ రంజాన్ మాసం పురస్కరించుకుని ఫిబ్రవరి నెల 18వ తేదీ నుండి ఈనెల 20 వ తేదీ వరకు నెల రోజులు పైగా పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న జి.ఎస్.ఆర్. ఆస్పత్రిలో ఎముకలు కీళ్ల ,ఓపిడి సేవలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో శుక్రవారం జి.ఎస్.ఆర్. ఆస్పత్రిలో జరిగిన అభినందన కార్యక్రమంలో జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావులు డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ అరిఫా బాను దంపతులను శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ గత నెల రోజులలో రెండు వేల మందిపైగా రోగులకు ఉచిత ఎముకలు, కీళ్ల ఓపిడి చికిత్సలు అందించడం జరిగిందన్నారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేశామని, 40 మందికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించామని తెలిపారు. చాలామంది పేదలు భవిష్యత్తులో తరచూ చూపించుకోవలసిన అవసరం ఉన్నవారు ఉండడంతో, ఇకపై ప్రతి గురువారం జి ఎస్ ఆర్ ఆస్పత్రిలో ఎముకలు ,కీళ్ల ఓపిడి చికిత్సలు ఉచితంగా అందరికీ అందిస్తామని ప్రకటించారు. ఇది నిరంతరం కొనసాగిస్తామని అన్నారు.
డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ మహమ్మద్ రఫీ నెల రోజులపాటు ఉచితంగా ఓపిడి చికిత్సలు అందించడం ప్రశంసనీయమన్నారు. ప్రతి గురువారం నిరంతరంగా ఉచిత ఎముకలు, కీళ్ల ఓపిడి చికిత్సలు అందజేయడానికి ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు.
ఈ కార్యక్రమంలో జి ఎస్ ఆర్ ఆసుపత్రి మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆరీఫా బాను,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావులు పాల్గొన్నారు.

# కన్నడిగులకు మహానందీశ్వరుడి దర్శనం కరువు..!

**..50 రూ టికెట్ కొంటేనే దర్శనం. -..ఎంతో వ్యయ ప్రయాసలపై వచ్చిన భక్తులకు నిరాశేనా.?**





**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 20:**
మహానంది పుణ్యక్షేత్రంలో కన్నడిగులకు ఉచిత దర్శనం కల్పించని అధికారులు. ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని పేద కన్నడిగులు శ్రీశైలం దర్శనం అనంతరం మహానందిశ్వరుని దర్శించుకునేందుకు ఎంతో వ్యయ ప్రయాసలపై వస్తుంటారు. ఉచిత దర్శనం అనే మాటే లేకుండా 50 రూపాయలు టికెట్ తీసుకుని వెళ్తేనే దర్శన భాగ్యం కలుగుతుందని భక్తులు వాపోతున్నారు. కొందరు టికెట్ కొనలేని వారు ఆలయం ముందు బాగాన నమస్కరించుకొని వెను తిరుగుతున్నటువంటి పరిస్థితి నెలకొంటున్నాయి. వందల కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఎంతో పవిత్రంగా వచ్చే భక్తులకు ఇచ్చే కానుక ఇదేనా అంటూ కన్నడ భక్తుల అసహనం దేవదాయ శాఖ ఉచిత దర్శనం కల్పించాలని ఆంక్షించిన ఇక్కడ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఆదాయమే పరమావధిగా ప్రవర్తిస్తున్న అధికారుల ధోరణిపై కనడ భక్తుల అసహనం. భక్తిని చూడాల్సిన అధికారులు ఆదాయం మాత్రమే చూస్తాం అంటున్న వైనంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

# మహానంది అర్చకుడికి సీఎం చేతుల మీదుగా ఉగాది పురస్కారం.



**ఆంధ్ర ప్రగతి మహానంది, మార్చి 19:**మహానంది పుణ్యక్షేత్రంలో అర్చకుడిగా పనిచేస్తున్న రెంట చింతల వెంకట శేషయ్య శర్మ ఉగాది పురస్కారం అందుకున్నారు. గురువారం ఉగాది పండుగ పర్వదినాన విజయవాడలోని కళాక్షేత్రం నందు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు , క్షేత్రంలోని వేద పండితులు, అర్చకులు మరియు సిబ్బంది అభినందలు తెలిపారు.

# దివ్యాంగులకు నిరుపేదలకు చీరల పంపిణీ.

**ముఖ్యఅతిథిగా హాజరై చీరలు పంపిణీ చేసిన నంద్యాల బ్లడ్ సెంటర్ ఎండి అచ్చు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:** నంద్యాల పట్టణంలోని జగజ్జనని నగర్ ఆరవ వార్డు నందు డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో రంజాన్ పండగ సందర్భంగా డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం దగ్గర నిరుపేద దివ్యాంగ కుటుంబాలకు మరియు నిరుపేద ముస్లిం మహిళలకు దాతల సహకారంతో దాదాపుగా వందమంది మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల బ్లడ్ బ్యాంకు ఎండి అచ్చు హాజరై నిరుపేదది ఆ కుటుంబాలకు నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. నంద్యాల బ్లడ్ బ్యాంకు ఎండి అచ్చు మాట్లాడుతూ.. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని తమ వంతుగా చీరల పంపిణీ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించామని భవిష్యత్తులో కూడా దివ్యాంగుల కోసం సహాయ సహకారాలు అందిస్తామని ఇప్పటికే దివ్యాంగులకు ఉచితంగా బ్లడ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డిజేబుల్డ్ రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వల్లి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రంజాన్ మాసములో దాతల సహకారంతో నిరుపేద దివ్యాంగుల కుటుంబాలకు మరియు పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా, మరియు చీరలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సభ్యులు


# నంద్యాలలో ప్రమోద్ గ్యాస్ట్రో, లివర్ కేంద్రం, వాణి కిడ్స్ ఆసుపత్రి ప్రారంభం

**నూతన ఆసుపత్రి ఏర్పాటుచేసిన జీర్ణకోశ, లివర్ వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రమోద్ కుమార్ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవాణి.**

**ఆసుపత్రిని ప్రారంభించిన జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవి కృష్ణ.**

**చిన్నపిల్లల వైద్య విభాగాన్ని ప్రారంభించిన హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 20:**
నంద్యాల పద్మావతి నగర్ స్టేడియం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రమోద్ గ్యాస్ట్రో లివర్ కేంద్రం,వాణి కిడ్స్ ఆసుపత్రి ని శుక్రవారం జాతీయ ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు.
మెడికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ, లివర్ సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రమోద్ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీవాణి గతంలో శ్రీనివాస జూనియర్ కళాశాల నిర్వహించిన భవనంలో నూతనంగా ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల వైద్య విభాగాన్ని హైదరాబాద్ హైటెక్ సిటీలో ఉన్న స్త్రీ, శిశు మెడికవర్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ రవీంద్రారెడ్డి ప్రారంభించారు. వివిధ ఓపిడి,ఎండోస్కోపీ విభాగాలను నంద్యాల ఈమె మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్,గ్యాస్ట్రో ఎంటరాలజీస్ట్ డాక్టర్ భార్గవరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి ,డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సునీత లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్ రెడ్డి,డాక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో గ్యాస్ట్రో మరియు లివర్ సంబంధిత మెడికల్ చికిత్సలు ,చిన్నపిల్లల చికిత్సల కోసం అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు లు మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక మెడికల్ గ్యాస్ట్రో, లివర్ ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ఇదే ఆసుపత్రిలో చిన్న పిల్లల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇద్దరు వైద్యులు మంచి కళాశాలలో సూపర్ స్పెషాలిటీ వైద్యులుగా ఉత్తీర్ణులై, ఏఐజి మరియు మెడికవర్ ఆసుపత్రులలో పనిచేసి తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుని నంద్యాలలో వైద్య సేవలు అందించడానికి రావడం ప్రశంసనీయమన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా నంద్యాల ప్రాంత ప్రజలకు మంచి ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్యం అందించాలని శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలోడాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి , నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సునీత , ఉదయానంద గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ భార్గవరెడ్డి,డాక్టర్ వినోద్, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి ,డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

# మత సామరస్యం.. మానవసేవ..
# ఆధ్యాత్మికతల కలబోత రంజాన్..!

**..రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వహీద్ హుస్సేన్**

**..ముస్లిం సోదర, సోదరీమణులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు మార్చి 20:**
" పవిత్ర రంజాన్ మాసం నందు ప్రతి ముస్లిం భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు నిర్వహించారు. అయితే మార్చి 20వ తేదీన నెలవంక దర్శనంతో నెలరోజుల ఉపవాస దీక్షలు విరమణతో పవిత్ర రంజాన్ ను సంతోషంగా జరుపుకునే ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. నెలరోజులు పవిత్ర ఖురాన్ పఠనంలో నిమగ్నమై. నిష్టతో ఉపవాసాన్ని కొనసాగించి, అల్లాహ్ కరుణకు పాత్రులైన ముస్లిం సమాజం ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఈద్ -- ఉల్ ఫితర్ మత సామరస్యం మానవసేవ ఆధ్యాత్మికత కరుణ..ప్రేమల కలబోతగా నిలవడం ముస్లింలకు గర్వకారణం." అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ వహీద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలియచేశారు.




# సర్వ నరసింహ స్వామి ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు.

**..ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్రుడు, డి.చిన్న.**

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల మార్చి 20:**
శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్రుడు, డి. చిన్న పురస్కరించుకొని సర్వ నరసింహ స్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఉగాది పండుగ సందర్భంగా శ్రీ సర్వ లక్ష్మీనరసింహస్వామి నీ ప్రత్యేక రకరకాల రంగులతో కూడిన పుష్పాలతో, వివిధ రకాల పండ్లతో దేవుని అలంకరించారు.
సాంప్రదాయ పంచేకట్టు, భుజాల మీద దేవుని కండువాతో ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమానికి విచ్చేసిన ఆలయ చైర్మన్ రేచర్ల నాగేంద్రుడు, డి .చిన్న గారిని వేద పండితులైన రంగనాయకులు పవన్ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.
పూజా కార్యక్రమంలో అన్ని శుభాలు జరగాలని, విజయాలు సిద్ధించాలని సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు మేలు కలగాలని, ఆనందంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇంట్లో కలకలలాడాలని మన సాంప్రదాయాలు కలకాలం వర్ధిల్లాలని చైర్మన్ రేచర్ల నాగేంద్రుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులతో పంచాంగ శ్రవణం వినిపించారు.
రేచర్ల నాగేంద్రుడు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉగాది పండుగలు ఘనంగా జరుపుకుంటున్న అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.





# రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదు

## బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు -మంత్రి నాదెళ్ల మనోహర్ హెచ్చరిక

**అమరావతి,మార్చి20ఆంధ్ర ప్రగతి** రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. ప్రజల్లో అపోహలు, ఆందోళనలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గృహ అవసరాల కోసం ఉద్దేశించిన వంట గ్యాస్ ఎక్కడా కొరత లేదని మంత్రి తెలిపారు. గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఆయిల్ కంపెనీలు కూడా తెలియజేశాయని చెప్పారు. అయితే గ్యాస్‌ను పక్కదారి పట్టించడం, అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించా ల్సిందిగా సూచించారు. జిల్లాల్లో గ్యాస్ ఏజెన్సీలు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద బుకింగ్స్, డెలివరీలు, పెండింగ్ అంశాలను నిరంతరం సమీక్షించాలని జాయింట్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా సరఫరాలో అక్రమాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మంత్రి మాట్లాడుతూ.. గ్యాస్



కొరతపై ప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషిస్తున్నామని చెప్పారు. ఈ నెల 21న రావాల్సిన గ్యాస్ నౌక 25న చేరుతుందని కేంద్రం సమాచారం ఇచ్చిందని వెల్లడించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైనంత మేరకే గ్యాస్ బుక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికంగా బుకింగ్స్ చేస్తే ఇతరులకు ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు. గ్యాస్ బుకింగ్స్ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని, ఓటీపీ వచ్చిన తర్వాతే బుకింగ్ ఖరారవుతుందని తెలిపారు. బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే మీడియా కథనాల ఆధారంగా నిఘా పెంచినట్లు చెప్పారు. గృహ అవసరాల గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు మళ్లించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. అదేవిధంగా, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అర్బన్ ప్రాంతాల్లో పైప్డ్ గ్యాస్ విధానంపై పని జరుగుతోందని వెల్లడించారు. హోటల్స్, రెస్టారెంట్ల ప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పాఠశాల హాస్టల్స్, ఆసుపత్రులకు గ్యాస్ సరఫరా ప్రాధాన్యను బట్టి ఇస్తామని చెప్పారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్రం కిరోసిన్ సరఫరాను కూడా అనుమతించిందని, అవసరమైతే రాష్ట్రంలో మళ్లీ వినియోగంలోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు.

# నేడు రంజాన్ సెలవు

## నేటి పదో తరగతి పరీక్ష ఎప్రిల్ 2కు వాయిదా

**అమరావతి,మార్చి20ఆంధ్ర ప్రగతి**



రంజాన్ సెలవును ఈ నెల 21వ తేదీ శనివారానికి మార్పు చేస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొదట మార్చి 20 న ప్రభుత్వం రంజాన్ సెలవుగా ప్రకటించింది. మతపెద్దల నిర్ణయం మేరకు 21వ తేదీ శనివారం రంజాన్ పర్వదినాన్ని నిర్వహిస్తుండటంతో ఆ రోజును సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. కాగా శనివారం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షను వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. ఈ పరీక్షను ఏప్రిల్ 2 న నిర్వహించనున్నట్లు తెలిపారు.

------

# చంద్రగిరిలోనే తిష్టవేసిన గజరాజులు

**తిరుపతి,మార్చి20ఆంధ్ర ప్రగతి**
చంద్రగిరి మండలం, ఎల్లంప్లలెలో ఏనుగుల మంద కలకలం రేపింది. గత వారం రోజులుగా గ్రామంలోనే గజరాజులు తిష్ఠ వేశాయి. రాత్రి వేళల్లో పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. ఏనుగుల దాడిలో పంటలు దెబ్బతిన్నాయి. ఏనుగుల నుంచి తప్పించుకునే క్రమంలో పశువుల కాపరి ముత్తు రామయ్యకు గాయాలయ్యాయి. గజరాజుల సంచారంతో ఎల్లంప్లలె గ్రామస్తులు భయాందోళనతో బతుకుతున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

# వార్తల్లో రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా

## దేశ ప్రజల పక్షాన చెడుగుడు ఆడేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 20:**
రాఘవ చద్దా ఢిల్లీ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకుడు ఆయన 2022 పంజాబ్ శాసనసభ ఎన్నికల ఇన్చార్జి గా ప్రస్తుతం ఢిల్లీలోని రాజేందర్ నగర్ ఎమ్మెల్యేగా ఉన్నాడు. రాఘవ్ చద్దా ను 2022 వ సంవత్సరంలో అమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈయన ఢిల్లీ యూనివర్సిటీలో తన చదువు పూర్తయిన అనంతరం వృత్తిపరంగా చార్టెడ్ అకౌంటెంట్ గా బిజీగా ఉండేవారు. అయితే ఇటీవల దేశంలో వార్తల్లో ప్రముఖ వ్యక్తిగా ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం ట్రేడింగ్ అవుతున్న గొప్ప నేత.

### పార్లమెంటులో ఆయన ప్రశ్నలకు వణుకుతున్న కేంద్ర ప్రభుత్వం.

పార్లమెంటులో ఆయన ప్రశ్నలకు వణుకుతున్న కేంద్ర ప్రభుత్వం ఆయన ప్రశ్నిస్తున్న ప్రశ్నలు ఒక పార్లమెంటు సభ్యుడు లేదా ఒక శాసన సభ్యుడు ఎన్నికయ్యాక ప్రజా సమస్యలను పట్టించుకోకపోయినా, అవినీతికి పాల్పడిన, ఐదు సంవత్సరముల వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా మధ్యలోనే వారిని తొలగించే వ్యవస్థ రావాలని రాఘవ్ చద్దా కోరారు. సామాన్య ప్రజల గొంతు గా మాట్లాడితే సస్పెండ్ చేయడం ఆయనకు దక్కేది. ఇదేనా ఫలితం? ఆరోగ్య బీమా మీద పన్నులు తగ్గించమంటే పార్లమెంటు నుంచి ఆయనను బయటకు పంపిస్తారా.? ఇది ప్రజాస్వామ్యమా? లేక గళం నొక్కే కుట్ర రాజకీయమా.? నిజము, మాట్లాడే వాళ్లకు ఇదే పరిస్థితి. రేపు మన మాట ఎవరు వినాలి? ఇది కేవలం ఒక వ్యక్తి విషయం కాదు ప్రతి సామాన్యుడికి సంబంధించినటువంటి విషయం సత్యం మాట్లాడితే సస్పెన్షన్ చేస్తారా? ఆయన పార్లమెంటులో మాట్లాడుతూ ఐదు కిలోల రేషన్ కోసం వెళితే వేలిముద్ర వేయించుకుంటున్నారు. సామాన్య రైతులు యూరియా తీసుకోవడానికి వెళితే వేలిముద్రలు వేయించుకుంటున్నారు. పెన్షన్ తీసుకోవడానికి వెళితే వేలిముద్రలు వేయించుకుంటున్నారు. ఇలా ప్రతి నిత్యవసర వస్తువుకు వేలిముద్ర అవసరమైనప్పుడు ఓటు వేసేటప్పుడు వేలిముద్ర ఎందుకు వేయించుకోరు? పోలింగ్ కేంద్రం వద్ద కూడా వేలిముద్ర, ఆధారిత వ్యవస్థ ఉండాలి కదా ! ఇలాంటి వ్యవస్థ ఉన్నప్పుడు ఓటింగ్ అనంతరం, నకిలీ ఓటింగ్ మరియు అక్రమాలు ఇలాంటి ప్రశ్నలు స్వయంచాలకంగా అంతరించిపోతాయి. ఈ విధంగా పార్లమెంటులో చెడుగుడు ప్రజల పక్షాన ఆడేస్తున్నాడు. అదేవిధంగా దేశంలో టెలికాం సంస్థల మోసాలను, ప్రభుత్వం ఎంపీలకు చెల్లిస్తున్న టెలిఫోన్ బిల్లులు, తదితర అంశాలను సభలో ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కు పెద్ద షాక్ ఇచ్చాడు. పార్లమెంటు లోపల ఆయన చేసిన వ్యాఖ్యలు, కేంద్రానికి ఆయన వేసిన ప్రశ్నలు సామాజిక మాధ్యమాల ద్వారా వీడియోలు పెద్ద ఎత్తున వైరల్ అయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యుడు తాజాగా యాన పెళ్లయిన దంపతులకు ఆదాయపు పన్ను ఫైలింగ్ విధానాన్ని ప్రతిపాదించారు. ప్రస్తుత వ్యవస్థలో భార్యాభర్తలు విడివిడిగా పన్ను చెల్లించడం వల్ల ఆర్థిక భారం పెద్ద ఎత్తున పెరుగుతుందని విమర్శించారు. కుటుంబ ఆదాయాన్ని సక్రమంగా పరిగణించి పన్ను స్లాబ్ లను ఆప్టిమైజ్ అంటే సానుకూలంగా వ్యవస్థను



అత్యంత ప్రభావవంతంగా, పరిపూర్ణంగా లేదా సాధ్యమైనంత ఉత్తమంగా చేయాలని సూచించారు. ప్రస్తుత విధానములో అన్యాయం ఉందని తెలియజేశాడు. భారతదేశంలో ఆదాయపు పన్ను చట్టం ప్రకారం ప్రతి వ్యక్తి విడిగా ఇన్కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలి. ఉదాహరణకు ఇద్దరూ ఏడాదికి 10 లక్షలు సంపాదిస్తే పూర్తి మినహాయింపు, ఓల్డ్ రిజిమ్ వల్ల పన్ను లేదు. కానీ ఒకరు 20 లక్షల రూపాయలు సంపాదిస్తే 30% స్లాబ్ లో 1.92 లక్షలు పన్ను విధించబడుతుంది. సెస్ తో సహా ఇది ఆదాయం అసమాన పంపిణీ ఉన్న కుటుంబాలకు శిక్షలాగా పనిచేస్తుంది. రాఘవ చద్దా ఈ లోపాన్ని హైలెట్ చేసి కుటుంబ యూనిట్ని పరిగణించాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో పాత పన్ను విధానం అనేది ఒక సాంప్రదాయ పన్ను నిర్మాణం. ఇది పన్ను చెల్లింపుదారులకు వారి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తగ్గించుకోవడానికి అనేక మినహాయింపులు మరియు తగ్గింపులను కల్పించింది ఉదాహరణకు 80 హౌస్ రెంట్ అలవెన్స్ మరియు లీవ్ ట్రావెల్ అలవెన్స్ క్లైమ్ చేసుకునేందుకు అనుమతిస్తుంది. ప్రస్తుతము కొత్త పన్ను విధానం డిఫాల్ట్ గా ఉన్నప్పటికీ వ్యక్తులు ఈ తగ్గింపులో ప్రయోజనాన్ని పొందడానికి ప్రతి సంవత్సరము పాత విధానాన్ని ఎంచుకోవచ్చు. 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి (2025-2026 అసెస్మెంట్ సంవత్సరము పాత పన్ను విధానము యధాతథంగా కొనసాగుతుంది. అయితే ప్రతిపాదిత మార్పులు కోరారు జాయింట్ ఫైలింగ్ ను ఐచ్చికంగా అందించాలని రాఘవ్ చద్దా పేర్కొన్నారు. దీనితో దంపతులు కలిసి ఆదాయాన్ని రిపోర్టు చేసి, తక్కువ స్లాబ్ ల్లో పన్ను చెల్లించవచ్చు అని అన్నారు. అమెరికా, యూరోపియన్ దేశాలలో ఇలాంటి వ్యవస్థ ఉంది. ఇక్కడ కుటుంబ ఆదాయానికి డబుల్ మినహాయింపు, తక్కువ రేట్లు వర్తిస్తాయి. భారతదేశం ఇది అమలు చేస్తే మహిళల సంపాదన పెరిగి కుటుంబాలు ప్రయోజనం పొందుతాయి.
ప్రభుత్వ ఆదాయంపై ప్రభావము తీవ్రంగా ఉండకపోవచ్చు, ఎందుకంటే చాలామంది ఇప్పటికే విడిగా ఫైల్ ఉన్నటువంటి విషయం మనందరికీ తెలుసు.
అమలులో పెను మార్పులు సవాళ్లు
అమలులో ఆదాయ ధ్రువీకరణ, విడాకులు, పొదుపు ఆస్తులపై స్పష్టమైన నిబంధనలు అవసరం, ఇన్కమ్ టాక్స్ విభాగం సాంకేతికంగా సిద్ధంగా ఉంటే సులభం. కుటుంబాల ఆదాయ పెరుగుదల ప్రోత్సాహం, మహిళల ఉద్యోగాలు పెరగడం, పన్ను సర్కారు రెవెన్యూ పెరగడం, అంటే ఎక్కువ ఫైలింగులు. ఈ ప్రతిపాదన బడ్జెట్ సంస్కరణలకు మార్గం సుగము చేస్తుంది.రాఘవ్ చద్దా ప్రతిపాదన ప్రభుత్వ ఆలోచనకు దారి తీస్తే 2027 వ సంవత్సరం బడ్జెట్లో అమలు అవకాశం ఉంది. ఇది పన్ను వ్యవస్థను మరింత న్యాయవంతం చేస్తూ మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కలిగిస్తుంది. ప్రజలందరూ ఆయనకు మద్దతుగా ఉంటారని కోరుకుందాం.



**డా.జి.బాలస్వామి**
**న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు**